'బీజేపీ నాయకులకు ఓట్లు అడిగే హక్కు లేదు'



కార్ఖానాలో మీడియాతో మాట్లాడుతున్న జమీల్

రసూల్‌పురా: రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి సర్వీస్ చార్జీలు రూ.800 కోట్లు బకాయిలను విడుదల చేయించలేని దుస్థితిలో ఉన్న బీజేపీ నాయకులకు పార్లమెంట్, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం సీనియర్ నాయకులు జమీల్ అన్నారు. మంగళవారం కార్ఖానాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి ఎంపీగా కొనసాగిన కాలంలో రేవంత్‌రెడ్డి పార్లమెంట్ పరిధిలోని ఏ ఒక్క నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని ఆ పార్టీ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదని నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ మీడియా సమావేశంలో ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. నిజానికి బొల్లారంలో జనరల్ హాస్పిటల్ ప్రారంభించిన మనోహర్ పారికర్ కానీ.. బీజేపీ కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రామకృష్ణ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎంపీ కొనసాగిన కాలంలో రేవంత్‌రెడ్డి బొల్లారం ఆసుపత్రి అభివృద్ధికి సొంతంగా రూ. కోటి ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, రోహిత చంద్ర, షేక్ దావూద్, అబ్దుల్ రియాజ్, సయిద్ ఖలీమ్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఉగాది పురస్కారాల ప్రదానం



ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ సిటిజన్స్ ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి ఆధ్వర్యంలో కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు, అక్కినేని నాటక కళా పరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు, రచయిత్రి ఇనుగంటి లావణ్యలు హాజరై 23 మంది సీనియర్ సిటిజన్స్‌కు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేవ చేసేందుకు వయస్సుతో నిమిత్తం లేదని, 80 ఏళ్లు దాటిన తర్వాత కూడా సేవ చేసేందుకు ఉత్సాహంగా ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. అలాంటి వారిని గుర్తించి జేఎస్‌టీ శాయి వారిలో మరింత ఉత్సాహాన్ని కలిగించేలా ఉగాది పురస్కారాలను అందజేయడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు కొత్తపల్లి మధుసూదన్‌రావు, శ్రీనివాస సమాజ సేవా సమితి ట్రస్టీ పార్థసారధి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్‌సీ కుమార్, అనంతరెడ్డి, జే ప్రసాద్, వైకేడీ ప్రసాద్, నాగమణి, రాజేశ్వరి, మాలిని, జానకి, లావణ్య పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఐశ్వర్య బొడ్డపాటి

సనత్‌నగర్: క్రమశిక్షణ, సాధించాలనే పట్టుదల ఉంటే లక్ష్య ఛేదన సాధ్యమవుతుందని భారత నావికాదళం లెఫ్టినెంట్ కమాండర్ ఐశ్వర్య బొడ్డపాటి అన్నారు. మంగళవారం నిర్వహించిన బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 53వ వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురవుతుంటాయని, ఆత్మస్థైర్యంతో వాటిని అధిగమించాలన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాలల జాబితాలో దేశంలోనే ప్రథమ స్థానంలో బేగంపేట కళాశాల గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కళాశాలలకు చెందిన డాక్టర్ వెంకటేశ్వర్లు రచించిన 'తెలంగాణ సంస్కృత, సాహిత్య తరంగిణి' అనే జాతీయ సదస్సు పత్రాల ముద్రణ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ వసుధ, డాక్టర్ నాన్సి సరీనా, డాక్టర్ ఆని శరణ్, ఉషారాణి, పద్మజ, అప్సరున్నీసా, రామాచారి, నర్సింహులు, మధుకర్‌రావు, మాధురి పాల్గొన్నారు.

పద్మారావుకు మోటార్ డ్రైవర్స్ యూనియన్ మద్దతు



పద్మారావుగౌడ్‌తో సమావేశమైన యూనియన్ ప్రతినిధులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి టీ.పద్మారావుగౌడ్‌కు తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ తమ మద్దతును ప్రకటించింది. మంగళవారం యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య నేతృత్వంలో ప్రతినిధి బృందం టకారాబస్తీలోని పద్మారావు నివాసానికి వచ్చి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పద్మారావు విజయం కోసం తమ వంతు కృషి చేస్తామని యూనియన్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు శ్రీనివాస్, నిరంజన్, పెద్దిరాజు, రాకేశ్, కుమార్, ఎల్లయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.



ఓ వైపు చేరికలు..



మరోవైపు వర్గపోరు!

కంటోన్మెంట్ కాంగ్రెస్‌లో రాజుకుంటున్న అసమ్మతి సెగ

- అయోమయంలో కార్యకర్తలు
- సీఎం దృష్టికి పంచాయతీ

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు అసమ్మతి రాగం ఆలపిస్తున్నారు. ఉప ఎన్నిక సందర్భంగా బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చి టికెట్ దక్కించుకున్న శ్రీగణేష్ తమను నిర్లక్ష్యం చేస్తున్నారని పార్టీ సీనియర్ నాయకులు సహకరించేదే లేదని ఒక పక్క భీష్మించుకుని ఉంటుండగా మరో పక్క బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులను చేర్చుకుంటుండడంతో పార్టీలో వర్గపోరు రోజు రోజుకు తారాస్థాయికి చేరుకుంటోంది. ఎన్నికల ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు పార్టీ సీనియర్ నాయకులను సంప్రదించకుండానే వారికి సమాచారం లేకుండా బీఆర్‌ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకుంటూ వార్డు ఇన్‌చార్జిగా, ఒక వేళ బోర్డు ఎన్నికలు జరిగితే పార్టీ తరఫున మీరే అభ్యర్థిగా ప్రకటిస్తామని హామీ ఇస్తుండడంతో సీనియర్ నాయకులు మైనంపల్లి తీరు పట్ల బహిరంగంగానే విమర్శిస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి తమ ఆధిపత్య పోరును కొనసాగిస్తుండటంతో పార్టీ బలోపేతం మాట దేవుడెరుగు పార్లమెంట్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలపై ప్రభావం చూపే అవకా శం ఉందని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

సునీతా మహేందర్ రెడ్డికి ఫిర్యాదు..

ఉప ఎన్నికను పురస్కరించుకుని పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీగణేష్ తమను పట్టించుకోవడం లేదని ఒంటెద్దు పోకడంతో విసిగిపోయామని ఈ ఎన్నికల్లో అభ్యర్థికి సహకరించబోమని నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ నేతలు పీసీసీ సెక్రటరీ, మైనార్టీ నాయకులు, వార్డు అధ్యక్షులు మూకుమ్మడిగా 50 మంది నాయకులు ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మైనంపల్లికి సునీతా మహేందర్ రెడ్డి వివరించగా వారిని తన వద్దకు పంపించాలని సూచించినప్పటికీ శ్రీగణేష్‌ను వ్యతిరేకిస్తున్న నేతలు మైనంపల్లిని కలవకపోవడం గమనార్హం. చివరికి సీఎం రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగి శ్రీగణేష్‌ను తీవ్రంగా మందలించి సీనియర్ నాయకులను కలుపుకోవాలని ఆదేశించినా శ్రీగణేష్ సీనియర్ నాయకులను కొందరిని కలవలేదని సమాచారం.



ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని కలిసిన సీనియర్ నాయకులు



మాట్లాడుతున్న గజ్వేల్ భరత్

మైనంపల్లిపై అసహనం..

మైనంపల్లి హన్మంతరావు బీఆర్‌ఎస్ నాయకుడు సతీష్‌ను పార్టీలో చేర్చుకుంటూ వార్డు ఇన్‌చార్జిగా పదవి కట్టబెట్టడం తగదని తమ లాంటి వారిని సంప్రదించాల్సి ఉంటే బాగుండునని ఐదో వార్డు అధ్యక్షుడు గజ్వేల్ భరత్‌తో పాటు పలు వార్డుల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో లేనప్పటికీ పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి పాటు పడ్డామని, పార్టీ కోసం శ్రమించామని కాని జంపింగ్ చేసే నాయకులను పార్టీలో చేర్చుకుని సీనియర్ నాయకులను పక్కన పెట్టడం పద్ధతి కాదన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం





నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న గౌలికార్ సోనీ, టీఎన్ వంశ తిలక్ , నివేదిత

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నిక కోసం మంగళవారం 11 మంది తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు కాగా మిగతా నలుగురు అభ్యర్థులు వేర్వేరు పార్టీల నుంచి నామినేషన్లు వేశారు. ఇండియన్ నేషనల్ యువజన పార్టీ నుంచి బందెల క్రాంతికుమార్, సోషల్‌జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి గౌలికార్ సోనీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి బోనుమల్ల వేణుగోపాల స్వామి, విధుతలై చిరుతాయిగల్ కట్చి నుంచి పగిడిపల్లి శ్యాంసన్, స్వతంత్ర అభ్యర్థులుగా పులిమామిడి వెంకటేశ్‌గుప్తా, వేలమర్తి రవికిరణ్, బత్తుల రవి, పంపరి నరసింహా నరేందర్, మహ్మద్ అక్రం అలీఖాన్, రెడ్డిమల్ల పార్వతి, ఉత్తమ్ ప్రవీణ్‌కుమార్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్‌కు తమ పత్రాలు అందజేశారు. మంగళవారంతో సికింద్రాబాద్ నుంచి 29 మంది నామినేషన్లు వేశారు.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక కోసం మంగళవారం మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ నుంచి వంశ తిలక్, బీఆర్‌ఎస్ నుంచి జి. నివేదిత రెండో సెట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి శంకర్ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకు 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

బౌద్ధనగర్‌లో బీజేపీ ప్రచారం



బౌద్ధనగర్: దేశవ్యాప్తంగా బీజేపీ పార్టీకి మద్దతు తెలుపుతున్నారని బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు హనుమంత్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ బీజేపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను వివరించారు. రమేష్, సత్యనారాయణ, అరవింద్, కొమరయ్య, సాయినాథ్ , తిరుమలేష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు కార్మిక నాయకులు ఎక్కా శ్రీనివాస్ బీజేపీలో చేరారు. మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తిరిగి బీజేపీ అధికారంలోకి రావడానికి పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలన్నారు. రానున్న కాలంలో ఎక్కా శ్రీనివాస్‌కు పార్టీలో సముచితమైన స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాజశేఖర్‌రెడ్డి, హరినాథ్‌నాయి, ఉమేష్ ఖండెల్వాల్, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ గెలుపునకు పనిచేయాలి

అమీర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయం కోసం సమష్టిగా పని చేయాల్సిన అవసరముందని అమీర్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు మంగళవారం డివిజన్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ నెల 25న ఎస్‌వీఐటీ ఆడిటోరియం (మహబూబ్ కళాశాల)లో జరిగే నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు . హనుమంత్‌రావు, కూతురు నర్సింహా, లలితాగోపీ చౌహన్, అశోక్‌యాదవ్,కట్ట బల్‌రావు,వనం శ్రీనివాస్,రాణి కౌర్,సుమిత్ సింగ్, జితేందర్‌నాథ్ పాల్గొన్నారు.

దానంను కలిసిన నాయకులు

లాలాపేట: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను మంగళవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్. రామ్‌లాల్ ఆధ్వర్యంలో తార్నాక, లాలాపేటకు చెందిన నాయకులు, మహిళలు కలిసి సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషిచేస్తామని ఈ సందర్భంగా రామ్‌లాల్ పేర్కొన్నారు. సురేష్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బాలాంజనేయ జయంతి వేడుకలు ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న నాగులూరి సాయిబాబా

చిలకలగూడ: చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ 71వ జయంతి వార్షిక ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బాజభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా ఆంజనేయస్వామి పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ నెల 27వ తేదీ వరకు ఆలయ వార్షిక వేడుకలను కనుల పండువగా నిర్వహించనున్నట్లు సాయిబాబా తెలిపారు. బాలాంజనేయుని విగ్రహానికి పుష్పాలు, పండ్లు తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు బుధవారం ఫల,పుష్పాలంకరణలో దర్శనమిస్తారన్నారు.

రామకృష్ణ వ్యాఖ్యలు అర్థరహితం



విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు

కంటోన్మెంట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీజేపీ నేత రామకృష్ణ చేసిన విమర్శలు అర్థరహితమని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన చేసిన విలేకరుల సమావేశంలో నేతలు కొత్త సంజీవ రెడ్డి, ఆయూబ్‌ఖాన్ మాట్లాడారు. బీజేపీ నేతలు తమ ధోరణి మార్చుకోకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సమయంలో కంటోన్మెంట్ అభివృద్ధికి ఏమీ చేయలేదని చెప్పడం రామకృష్ణ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. బొల్లారం జనరల్ ఆసుపత్రికి రూ.1 కోటి నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన విషయం ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.48 కోట్ల టీపీపీ బకాయిలను చెల్లించడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఎలివేటెడ్ కారిడార్ సహా భవిష్యత్‌లో ఎన్నో పథకాలు కంటోన్మెంట్‌లో అమలవుతాయన్నారు. గజ్వేల్ భరత్, రాజేశ్ యాదవ్, జమీల్ పాల్గొన్నారు.

ఓటింగ్ పెరిగేలా సహకరించాలి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమీర్‌పేట: ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వయోవృద్ధుల సహకారం అవసరమని జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు.సనత్‌నగర్ డివిజన్ మోడల్ కాలనీలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అపార్ట్‌మెంట్, కాలనీలో ఉండే ఓటర్లు అందరు ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓట్లు వేసేందుకు రాని వారికి గుర్తించి ఓటు హక్కు ప్రాధాన్యం వివరించడంతో పాటు వారిని పోలింగ్ బూత్‌కు వచ్చేలా వృద్ధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

హనుమంతా.. జ్ఞానగుణవంతా

- భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి
- ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు

హనుమాన్ జయంతి వేడుకలను సోమవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ఆలయాల్లోని ఆంజనేయుడికి పంచామృతాభిషేకం, చందనం, నూతన వస్త్ర అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం దేవాలయాలు, కాలనీలు, బస్తీలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



రసూల్‌పురా దాసాంజనేయస్వామి దేవాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు





జయంతిలో పాల్గొన్న కాంగ్రెస్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి, సీనియర్ నేత అయూబ్‌ఖాన్



వేడుకల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



హనుమాన్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావు



బల్కంపేట వీర హనుమాన్ ఆలయంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి పూజలు



జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి



హనుమాన్ జయంతి వేడుకల్లో మాజీ మేయర్ కార్తీకారెడ్డి



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న బీజేపీ నేత మేకల సారంగపాణి



వీరాంజనేయ స్వామిని దర్శించుకుని మాజీ మంత్రి మల్లారెడ్డి



లాలాపేట లేబర్ అడ్డావద్ద అన్నదానం చేస్తున్న వైసీపీ నేత దర్గ సుఖేందర్‌రెడ్డి



ఓల్డ్ లాలాపేటలో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఏసీపీ జైపాల్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి



వేడుకల్లో పాల్గొన్న దానం నాగేందర్



హనుమాన్ జయంతి వేడుకల్లో బీజేపీ సీనియర్ నేత మర్రి పురురవరెడ్డి



పూజల్లో పాల్గొన్న వ్యాయామశాల నిర్వాహకులు, భక్తులు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు